నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 25 జనవరి 2025 | HYDERABAD

నేడు గ్రేటర్ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సమావేశం

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా బీఆర్ఎస్ పోరును ఉధృతం చేసేందుకు సిద్ధమైంది. ఏడాది కాలంగా గ్రేటర్‌లో అభివృద్ధి కుంటుపడటం, రోజు రోజుకు ప్రజా సమస్యలు పెరిగిపోతుండటంతో ప్రజలతో కలిసి సర్కారుపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నిరసన గళం వైపు అడుగులు వేశారు. ఇందులో భాగంగానే గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని నియోజకవర్గాల వారీగా వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలోనే పోరుబాటను ఉధృతం చేసేందుకు శనివారం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో గ్రేటర్ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం నగరంలోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేటర్లంతా దాదాపు 67 మంది ఈ సమావేశంలో పాల్గొంటారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై వారికి దిశానిర్దేశం చేయనున్నారు.

ఆర్ట్ అండ్ కాలిగ్రఫీ..

సిటీబ్యూరో: భారత రాజ్యాంగం 75వ వసంతోత్సవాన్ని పురస్కరించుకుని భారత విదేశీ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో శుక్రవారం ఆర్ట్ అండ్ కాలిగ్రఫీ ఎగ్జిబిషన్ కొలువుదీరింది. ఈ ఎగ్జిబిషన్‌ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. గవర్నర్‌కు హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ జొన్నలగడ్డ స్నేహజ ఎగ్జిబిషన్ సంబంధిత అంశాలను వివరించారు. ఈ ఏడాది ముగింపు వరకు ఎగ్జిబిషన్ సందర్శనకు అందుబాటులో ఉంటుందని స్నేహజ తెలిపారు.

సీఎం ఇంటి సమీపంలో డంపింగ్ యార్డు

కిలోమీటరు దూరంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం.. అర కిలోమీటరు దూరంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం.. వీరితో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మంత్రులు, వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు నివాసముంటున్న ప్రాంతమది. అంతటి ప్రాముఖ్యత కలిగిన జూబ్లీహిల్స్ రోడ్ నం. 36 ప్రధాన రోడ్డు పక్కన ఉన్న జీహెచ్ఎంసీ పార్కు ఇదిగో ఇలా చెత్తాచెదారం నిండిపోయి డంపింగ్ యార్డ్‌లా మారింది. అటు వెళ్లేవారు దుర్వాసనతో అవస్థలుపడుతున్నా.. అధికారులు మాత్రం 'స్వచ్ఛ హైదరాబాద్'ను గాలికొదిలేశారు. -బంజారాహిల్స్

స్వచ్ఛతలో సత్తా చాటేనా?

- స్వచ్ఛ సర్వేక్షణ్ -24పై త్వరలో ప్రారంభం కానున్న సర్వే
- కేంద్రం ప్రకటించే ర్యాంకుల్లో 'హైదరాబాద్' మెరుగ్గా నిలిచేనా?

సిటీబ్యూరో: హైదరాబాద్ నగరం స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుస్తుందా? బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంతో వచ్చిన ర్యాంకుల కంటే మెరుగైన ఫలితాలను రాబడుతుందా? ప్రస్తుత పారిశుధ్య నిర్వహణలో క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తుంటే అనేక అనుమానాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్-2024 ర్యాంకుల ప్రకటన, సర్వే ప్రక్రియ ప్రారంభమవుతున్న తరుణంలో జీహెచ్ఎంసీ అధికారుల్లో గుబులు మొదలైంది. ఏటా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కీలక నగరాలకు ర్యాంకులను ప్రకటిస్తూ వస్తున్నది. 2015 నుంచి 2023 వరకు 10 లక్షల జనాభా కంటే ఎక్కువ సిటీ జాబితాలో హైదరాబాద్ మెరుగైన ర్యాంకింగ్ సాధించింది. గతేడాది సిటీ 9వ ర్యాంకు, భారతదేశంలో ఫైవ్ స్టార్ రేటింగ్ పొందిన చెత్త రహిత నగరంగా హైదరాబాద్‌కు అవార్డు దక్కింది. వచ్చే నెలలో స్వచ్ఛ సర్వేక్షణ్-2024పై సర్వే ప్రారంభించి సుమారు రెండు నెలల పాటు జరగనున్నది. ఏప్రిల్‌లో ర్యాంకుల జాబితాను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. అయితే సర్వే ప్రారంభ దశలోనే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం విరుద్ధంగా కనబడుతుండటం గమనార్హం.

నిర్వహణలో అనేక లోపాలు

గార్బేజ్ ఫ్రీ సిటీనే లక్ష్యమని జీహెచ్ఎంసీ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా పరిస్థితులు కనబడుతున్నాయి. తరచూ చెత్త వేసే ప్రాంతాలు (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ) జీహెచ్ఎంసీ పరిధిలో 2640 ప్రాంతాలను గుర్తించి వాటిని పూర్తి స్థాయిలో ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో వీటికి అదనంగా కొత్తగా జీవీపీ పాయింట్లు పుట్టుకొస్తున్నాయి. సుమారు 5250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4886 కాలనీలలో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కొక్క ఆటోకు కాలనీ వారీగా చూస్తే ఒకటి లేదా రెండు కాలనీలు గృహాల ప్రకారం గమనిస్తే ఒక్కొక్క ఆటో కు సుమారుగా 500 నుంచి 600 ఇండ్లను కేటాయించి, చెత్త సేకరణ జరపాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా ఉండడం లేదు..చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు..వంద శాతం స్వచ్ఛ ఆటోల అటెండెన్స్ ఉండటం లేదు. రోజూ 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని స్వయంగా గత కమిషనర్లు గుర్తించారు. కానీ నేటికీ స్వచ్ఛ ఆటోల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించింది.

అప్పుడు..ఇప్పుడు ఎంతో తేడా

స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టి మెరుగైన ర్యాంకులను సాధించింది. స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా తడి, పొడి చెత్త వేర్వేరు , ఇంటింటి నుంచి చెత్త సేకరణ కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల భాగస్వామ్యం, ఓడీఎఫ్‌కు చర్యలు, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ చర్యలు, స్వచ్ఛతపై చైతన్య కార్యక్రమాలు, 50 మైక్రాన్ల కన్నా తక్కువ నిడివి ఉన్న ప్లాస్టిక్ నిషేధం వంటి కార్యక్రమాలు పక్కాగా చేపట్టింది. ప్రధానంగా చెత్తకుండీలు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే క్రమంలో దాదాపు 22 లక్షల గృహాలకు ఒక్కో ఇంటికి తడి, పొడి చెత్త సేకరణకు 44 లక్షల చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణకు 4500 స్వచ్ఛ ఆటో టిప్పర్లను వినియోగించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, ఆధునిక వాహనాల వినియోగంతో వెరసి జీహెచ్ఎంసికి ' బెస్ట్ సెల్ఫ్ సస్టైనబులిటీ అవార్డు, 3 స్టార్ రేటింగ్ సిటీగా నిలిపింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారిశుధ్య నిర్వహణలో పూర్తి గాడితప్పిందని ఆనడంలో ఎలాంటి సందేహం లేదు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ ర్యాంకులు ఇవే

జీహెచ్ఎంసీ ప్రతి ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను అందుకుంటున్నది. 2015 నుంచి 2022 వరకు 10 లక్షల జనాభా కంటే ఎక్కువ సిటీ జాబితాలో ర్యాంకింగ్ సాధించింది. 2016 సంవత్సరంలో 73 నగరాలకు మెరుగైన 19వ ర్యాంకును, 2017లో ఓడీఎఫ్ సిటీ కేటగిరీలో 434 నగరాలు పాలుపంచుకోగా, అందులో నగరానికి 22వ ర్యాంకు సాధించింది. 2018లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానంలో బెస్ట్ క్యాపిటల్ సిటీ అవార్డు కేటగిరీలో 4041 నగరాలు పాలుపంచుకుంటే నగరానికి 27వ ర్యాంకు వచ్చింది. 2019లో స్వచ్ఛ్ ఎక్సలెన్స్ అవార్డు కేటగిరీలో 4273 నగరాలు పాల్గొంటే , హైదరాబాద్‌కు 35వ ర్యాంకు వచ్చింది. ఓడీఎఫ్ ++ సిటీగా గుర్తింపు దక్కింది. 2020లో బెస్ట్ మెగా సిటీ అవార్డు సిటీజన్ ఫీడ్ బ్యాక్‌లో 4384 నగరాలు పాల్గొంటే నగరానికి 23వ ర్యాంకు వచ్చింది.

ప్రజాపాలన దరఖాస్తులు అటకెక్కినట్లేనా?

- మళ్లీ తీసుకున్న దరఖాస్తులు ఎప్పుడు పరిశీలిస్తారు..
- గ్రామ, వార్డు సభల్లో నిలదీతలు, నిరసనలు
- తూతూ మంత్రంగానే సభలంటూ.. మండిపాటు

శామీర్‌పేటలో జరిగిన వార్డు సభలో అధికారులను నిలదీస్తున్న మహిళలు

మేడ్చల్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో శుక్రవారం జరిగిన గ్రామ, వార్డు సభల్లో లబ్ధిదారుల ఎంపికపై అధికారులను నిలదీశారు. గ్రామ, వార్డు సభల్లో చదువుతున్నది లబ్ధిదారుల జాబితా కాదని, దరఖాస్తుల జాబితానేనని చెబుతున్నారని, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారందరివీ ఎందుకు చదవడం లేదని ఆరోపించారు. జాబితాలో పేర్లు రాని వారివి దరఖాస్తులు మళ్లీ తీసుకున్న అధికారులు.. మళ్లీ ఎప్పుడు పరిశీలిస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులు అటకెక్కించినట్టేనా అని అధికారులను నిలదీశారు. లబ్ధిదారుల ఎంపికపై నిర్వహించిన గ్రామ, వార్డు సభలు తూతూ మంత్రంగానే నిర్వహించినట్లు అర్థమైతున్నదని దరఖాస్తుదారులు మండిపడుతున్నారు.

దరఖాస్తుల వివరాల నమోదు తర్వాతే పరిశీలన..

గ్రామ, వార్డు సభల్లో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్లలో నమోదు తర్వాతే దరఖాస్తుదారుల పరిశీలన జరుగుతుందని అధికారుల ద్వారా తెలుస్తున్నది. అయితే వేల సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను నమోదు చేసేందుకు వారం రోజుల పట్టే అవకాశం ఉన్నది. నేపథ్యంలో ఇప్పుడు ఇచ్చిన దరఖాస్తుల పరిశీలన చాలా ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. ఈ నెల 26న నాలుగు గ్యారంటీల పథకాలను లబ్ధిదారులకు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పుడేమో జరిగిన గ్రామ, వార్డు సభల్లో ప్రకటించిన జాబితా దరఖాస్తుదారుదేనని మంత్రులు, అధికారులు చెబుతుండగా, మరి ఇప్పుడు లబ్ధిదారుల ఎంపిక జరగనట్టేనా అన్న అనుమనాలను దరఖాస్తుదారులు వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామ, వార్డు సభల్లో ప్రకటించిన దరఖాస్తుల జాబితాలనే అర్హులను ఎంపిక చేస్తారా అన్నది స్పష్టంగా అధికారులు చెప్పడం లేదు. కాగా, ఇప్పుడు వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించినట్లయితే డబులు దరఖాస్తులు వచ్చినట్లయింది.

మృతదేహాన్ని ఉడికించేందుకు పొటాషియం హైడ్రాక్సైడ్

- బాత్‌రూం అడ్డాగానే మృతదేహం ముక్కలు
- స్టాపై కాల్చి.. రోకలితో బొక్కలు పొడి
- నిందితుడు చెప్పిన విషయాలకు
- సాంకేతిక ఆధారాలతో విశ్లేషణ
- మాధవి మిస్సింగ్ కేసును హత్యగా మార్పు

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన మీర్‌పేట్‌లోని దారుణ ఘటనలో భార్యను ముక్కలు చేసి ఉడికించడానికి పొటాషియం హైడ్రాక్సైడ్‌ను వాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాత్‌రూంలో కూర్చొని శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికేశాడని ఒక అంచనాకు వచ్చారు. ఈ నెల 18న మీర్‌పేట్ ఠాణా పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో నివాసముండే పుట్ట వెంకట మాధవి మిస్సింగ్‌పై కేసు నమోదు అయ్యింది. ఈ కేసు దర్యాప్తులో ఆమె భర్తే అతి కిరాతకంగా ఆమెను చంపి, శరీరాన్ని ముక్కలు చేసి వేడి నీటలో ఉడికించి, బొక్కలు పొడి చేసి బాత్‌రూమ్ ఫ్లష్ ద్వారా డ్రైనేజీలోకి పంపించాడని వెల్లడైంది. ఈ ఘటనపై నిందితుడు గురుమూర్తి పోలీసులకు రోజుకో మాట చెబుతూ ఆధారాలు చిక్కకుండా ప్లాన్ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో సాంకేతిక పరమైన ఆధారాలు సేకరించేందుకు హైదరాబాద్ క్లూస్ టీమ్ హెడ్, సైంటిస్ట్ వెంకన్న బృందం సహకారం అందిస్తున్నది. బ్లూ రే టెక్నాలజీతో గురుమూర్తి ఇంట్లో నుంచి సేకరించిన ఆధారాలను మీర్‌పేట పోలీసులు విశ్లేషించారు. సాంకేతికపరమైన ఆధారాలు, 14వ తేదీ రాత్రి నుంచి 16వ తేదీ రాత్రి వరకు నిందితుడు గురుమూర్తి సెల్‌ఫోన్ సిగ్నల్స్, కాల్స్‌తో పాటు సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను సేకరించారు. సాంకేతికపరంగా సేకరించిన అంశాలు, నిందితుడు గురుమూర్తి చెప్పిన అంశాలను విశ్లేషించి.. మాధవిని గురుమూర్తి హత్య చేసి, ఆమె మృతదేహాన్ని దొరక్కకుండా నిందితుడు ప్లాన్ చేసినట్లు ఒక నిర్ధారణకు వచ్చారు. దీంతో ఇప్పటి వరకు మిస్సింగ్‌గా ఉన్న ఈ కేసును హత్య కేసుగా మార్చనున్నారు. హత్య కేసుగా మార్చిన తరువాత మరో సారి గురుమూర్తి ఇంట్లో సీన్ రికన్‌స్ట్రక్షన్ చేసి హత్య కేసులో పకడ్బందీ ఆధారాలను సేకరించి నిందితుడిని పోలీసులు అరెస్టు చేసే అవకాశాలున్నాయి.

బాత్‌రూమ్‌నే అడ్డాగా చేశాడు..

గురుమూర్తి తన భార్యతో గొడవ పడి ఆమెను హత్య చేశాడు. హత్య తరువాత ఆమె మృతదేహం కన్పించకుండా చేస్తే తనను ఎవరూ పట్టుకోరనే భావనలో ఉన్నాడు. దీంతో తన ఇంట్లో ఉన్న కత్తులతోనే మృతదేహాన్ని ముక్కలుగా చేశాడు. మొదట చేతులు, ఆ తరువాత రెండు కాళ్లు నరికి వాటిని రెండు భాగాలుగా చేసి బకెట్లో వేశాడు. హీటర్‌ను ఆన్ చేసి ఆ వేడి నీటిలో వాటిని ఉడికించాడు. మాంసం, బొక్కలు వేరుగా అయ్యేందుకు త్వరగా ఉడికేలా పొటాషియం హైడ్రాక్సైడ్‌ను కూడా వాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాత్‌రూమ్‌లోనే శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చేశాడు. బాత్‌రూమ్ బయట పెయింట్ కోసం ఉపయోగించే 25 లీటర్ల డబ్బాలో హీటర్ వేసి అందులో నీటని వేడి చేసినట్లు ఆధారాలు సేకరించారు. ముక్కలు మొత్తం మెత్తగా చేసి వాటిని టాయిలెట్‌లో వేసి ఫ్లష్ చేశాడు. అనంతరం బొక్కలను ఫంక్షన్ హాల్‌లో వంటలు చేసేందుకు ఉపయోగించే పెద్ద స్టౌపై కాల్చాడు. కాల్చిన బొక్కలను రోకలిపై వేసి దంచి, ఆ తరువాత వాటిని పొడి చేసి టాయిలెట్ ద్వారా డ్రైనేజీలోకి పంపించినట్లు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. ఈ కేసుపై ఇప్పటికే పోలీసులు పలు రకాలైన ఆధారాలను సేకరించి, హత్య జరిగిన విధానంపై విశ్లేషణ చేసి ఒక నిర్ధారణకు వచ్చారు. కేసులోని సెక్షన్లను మార్చి ఒకటి రెండు రోజుల్లో నిందితుడిని కోర్టులో హాజరుపరిచే అవకాశాలున్నాయి. కాగా ఈ ఘటనపై దేశంలోని ప్రధానమైన ఫోరెన్సిక్ ల్యాబ్‌ల నుంచి సహకారాన్ని తీసుకుంటున్నామని, ఇంకా దర్యాప్తు దశలోనే ఉందని, ఈ సమయంలో అధికారంగా ఏ విషయం మేం చెప్పలేమని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

జాబ్ మేళాలో ఎంపికైన వారికి నియామకపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

జాబ్ మేళాకు విశేష స్పందన

బడంగ్‌పేట: పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నగరం నలుమూలలా అనేక కంపెనీలు తీసుకొచ్చిన ఘనత మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలంలోని మన్‌సాన్‌పల్లిలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. అంతకుముందు జాబ్‌మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందన్నారు. యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కేసీఆర్ అనేక కంపెనీలు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పాండు, వైఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఒత్తిడితో ఆగమైతున్నం

దమ్మాయిగూడలో లైన్‌మెన్ల ఆందోళన

సిటీబ్యూరో:తమపై పని భారం పెరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వరుసగా ఎన్నికలు, ప్రభుత్వ కార్యక్రమాల కారణంగా బిల్లులు చెల్లించనివారి ఇండ్లకు కరెంట్ సప్లై డిస్‌కనెక్ట్ చేయకుండా అప్పట్లో ప్రభుత్వమే అడ్డుకుందని, ఇప్పుడేమో కోట్ల రూపాయల బకాయిలు వసూలు చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని విద్యుత్ లైన్‌మెన్లు ఆరోపిస్తున్నారు. దమ్మాయిగూడలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద లైన్‌మెన్ల జాక్ ఆధ్వర్యంలో లైన్‌మెన్లు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా డీఈ, ఏఈకి వ్యతిరేకంగా వారు నినాదాలిచ్చారు. తాము 24గంటలు డ్యూటీలో ఉంటామని, ఎప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోయినా ఆయా ప్రాంతాలకు వెళ్లి సప్లై పునరుద్ధరించాలని, అటువంటి పరిస్థితుల్లో తాము సమయానికి రావట్లేదంటూ.. మెమోలు ఇస్తున్నారని, కొత్తగా వచ్చిన అధికారులు తమను వేధిస్తున్నారంటూ ఆరోపించారు. వేసవి వస్తున్న సందర్భంగా తమపై పనిభారం మరింత పెరుగుతుందని..అధికారులు తమకు సహకరించకుండా ఒత్తిడి చేస్తుండడంతో తాము ఇబ్బంది పడుతున్నామని వారు చెప్పారు.

రసాభాసగా వేలం పాట

- హైకోర్డు ఉత్వర్వులతో కొనసాగిన హౌసింగ్ బోర్డు స్థలాల వేలం పాట
- 24 ప్లాట్లలో.. 12 ప్లాట్ల విక్రయం
- వేలం పాటను అడ్డుకునేందుకు యత్నించిన బీఆర్ఎస్ నేతల అరెస్టు

సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 24 : కేపీహెచ్‌బీ కాలనీలో హౌసింగ్ బోర్డు స్థలాలు విక్రయించేందుకు నిర్వహించిన వేలం పాట రసాభాసగా సాగింది. శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీ హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్‌లో హౌసింగ్ బోర్డు వెస్టన్ డివిజన్ పరిధిలోని ప్లాట్లను విక్రయించేందుకు నిర్వహించిన వేలంపాటను హౌసింగ్‌బోర్డు సెక్రటరీ రాజేశ్, ఈవో విమల, పీఆర్‌వో వాసు, ఈఈ కిరణ్‌బాబు, ఏఈవో సాయివర్ధన్ ప్రారంభించారు. నిబంధనల ప్రకారం...లక్ష రూపాయల డీడీతో రావాలని సూచించగా, స్థలాలను కొనేందుకు ఆసక్తి గల వారు 56 మంది వేలం పాటలో పాల్గొన్నారు. ఉదయాన్నే ప్రారంభించిన వేలంపాటను కోర్టు ఆదేశాల మేరకు మధ్యాహ్నం వరకు నిలిపివేసి...మళ్లీ కోర్టు ఆదేశాలను పాటిస్తూ వేలం పాటను పూర్తి చేశారు. వేలంలో మొత్తం 24 ప్లాట్లకు 12 ప్లాట్లు అమ్ముడుపోయినట్లు గృహనిర్మాణ శాఖ కమిషనర్ వీపీ గౌతం తెలిపారు. వేలంలో 1696.62 గజాలు అమ్ముడుపోయాయన్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.25.63 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో మరో 11 ప్లాట్లకు ఎవరూ బిడ్లు దాఖలు చేయలేదన్నారు. ఒక ప్లాటుపై కోర్టు కేసు ఉందన్నారు. గజానికి రూ.లక్ష కనిష్ఠంగా రూ.లక్షా 5వేలు బిడ్లు దాఖలయ్యాయన్నారు.

అక్రమ అరెస్టును నిరసిస్తూ.. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావుకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

భారీ బందోబస్తు మధ్య..

కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన హౌసింగ్ బోర్డు స్థలాల వేలంపాట రసాభాసగా సాగింది. భారీ బందోబస్తు మధ్య సాగిన ఈ వేలం పాటలో ప్లాట్లను కొనుగోలు చేసేందుకు వచ్చిన పలువురు అధికారుల తీరుపై విమర్శలు చేశారు. ఆయా ప్రాంతాల్లో అమ్మకానికి పెట్టిన ప్లాట్లు రోడ్డు విస్తరణలో పోతాయని, వాటికి కొనుగోలు చేస్తే తర్వాత తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకుండా ప్లాట్లను విక్రయిస్తున్నారా అని.... కొనుగోలు చేసే వారికి పలు అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసిన తర్వాతే వేలం పాటను నిర్వహించాలని కోరారు. అయితే అధికారుల నుంచి సరైన సమాధానం రాలేదు. పోలీసులు కల్పించుకొని ప్రశ్నలు అడిగిన వారికి వేలంపాట నుంచి బయటికి పంపించడంపై పలువురు విమర్శించారు. ఈ వేలంపాట నిర్వహించేందుకు బందోబస్తుగా బాలానగర్ డీసీపీ, అడిషనల్ డీసీపీ, ఏసీపీ, పలువురు సీఐ, ఎస్సైలుతో పాటు పలు పోలీస్ బృందాలు పాల్గొన్నారు. ఎక్కడికక్కడా బారికేడ్లను పెట్టి... ప్రశాంతంగా వేలంపాట నిర్వహించేందుకు కృషి చేశారు. కాగా, పోలీసులు అతీగా చేయడంతో సామన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వేలం పాట ప్రాంతానికి మీడియాను కూడా అనుమతించకపోవడంపై జర్నలిస్టులు నిరసన తెలిపారు.

ధనార్జనే ధ్యేయంగా హౌసింగ్ బోర్డు వ్యవహారం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సామాన్య ప్రజలకు సొంతింటి కలను నిజం చేయడం కోసం ఏర్పాటు చేసిన హౌసింగ్ బోర్డు సంస్థ.. పక్కా రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థగా మారిందని, ప్రజలను మోసం చేస్తూ, ధనార్జనే ధ్యేయంగా హౌసింగ్ బోర్డు సంస్థ భూములను అమ్ముతున్నదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీలో నిర్వహించిన హౌసింగ్ బోర్డు స్థలాల వేలం పాటను అడ్డుకుంటామని ప్రకటించిన ఎమ్మెల్యే కృష్ణారావును హౌస్ అరేస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డు వెస్టన్ డివిజన్ పరిధిలోని 23 స్థలాలను హౌసింగ్ బోర్డు స్థలాను వేలానికి పెట్టారని, ప్రజలకు నిజాలు చెప్పకుండా మోసం చేస్తున్నారన్నారు. కాలనీ 15వ ఫేస్‌లో మాస్టర్ ప్లాన్ ప్రకారం...100 ఫీట్లు ఉన్న రోడ్డును... వేలంపాటలో 80 ఫీట్ల రోడ్డుగా చూపారని, కాలనీ 7వ ఫేస్‌లో 200 ఫీట్ల రోడ్డును 80 ఫీట్ల రోడ్డుగా చూపి..అమ్మకానికి పెట్టారన్నారు. ఈ పాట్లను కొనుగోలు చేసిన వారు...భవిష్యత్ రోడ్డు విస్తరణలో స్థలాన్ని కోల్పోవాల్సి వస్తుందని, వారికి నష్టం జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. కాలనీల్లో అక్కడక్కడ మిగిలిన చిన్న చిన్న బిట్లను కాలనీ ప్రజల అవసరాల కోసం వదలాలని కోరినప్పటికీ అధికారులు ఆ స్థలాలన్నింటినీ వేలానికి పెట్టారన్నారు. మరోవైపు ఖాళీ స్థలాలను విక్రయించేముందు జీవో నంబర్ .6 ప్రకారం పక్కనున్న ప్లాట్ యజమానికి అవకాశం ఇవ్వాల్సి ఉండగా, బహిరంగ వేలంపాట ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణలో ప్లాట్లు పోతే టీడీఆర్ వస్తుందని అధికారులు చెప్పడం సరికాదని, వారు ఇచ్చే టీడీఆర్ హౌసింగ్‌బోర్డు తీసుకుంటే బాగుంటుందని, అమాయకులైన ప్రజలను మోసం చేయవద్దని కోరారు. బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువ ధరకు ప్లాట్‌ను కొనుగోలు చేస్తే... టీడీఆర్‌తో వచ్చేది పావువంతు కూడా కాదన్నారు. ఖాళీ స్థలాలను ప్రజలు కొనుగోలు చేసి మోసపోవద్దని కోరారు.

నా హక్కులను కాలరాస్తారా...?

'హౌసింగ్ బోర్డు అధికారులు సూచించన ప్రకారం... లక్ష రూపాయల డీడీని తీసుకున్నప్పటికీ...వేలం పాటకు వెళ్లకుండా పోలీసులు గృహనిర్బంధం చేయడం సరికాదు.. నా హక్కులను కాలరాస్తారా' అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని, పోలీసులు కూడా హద్దుదాటి వ్యవహరిస్తున్నదన్నారు. చట్టం ప్రకారం వేలంపాటలో పాల్గొనే హక్కు ఉన్నప్పటికీ అనుమతించకపోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేన్నారు. వేలానికి వెళ్లకుండా ఏసీపీతో పాటు నలుగురు ఎస్సైలు, 50 మంది కానిస్టేబుళ్లను పెట్టి తనను నిర్బంధించడం సరికాదన్నారు. ఈ వ్యవహారంపై పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని, న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోరాడుతానన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ నేతలను, కార్పొరేటర్లను హౌస్ అరెస్టు చేశారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ నేతల అరెస్టు

కేపీహెచ్‌బీ కాలనీలోని హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాల విక్రయించేందుకు చేపట్టిన వేలంపాటను అడ్డుకునేందుకు యత్నించిన బీఆర్ఎస్ పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం కూ